సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 25 । ఆగస్టు । 2025



గణపయ్య పండుగ.. ఉపాధి మెండుగా

మరో రెండు రోజుల్లో చవితి వేడుకల సందడి ప్రారంభం కానుంది. ఇప్పటి నుంచే వివిధ రంగాల కార్మికులు ఉత్సవాలకు సంబంధించిన పనులు జోరుగా చేస్తున్నారు. -8లో



రాష్ట్రంలో ప్రజా కంటక పాలన

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజా కంటక పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ నేతవెన్నపూస రవీంద్రారెడ్డి అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.340	రూ.440
రెండోరకం	రూ.200	రూ.320

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 85 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీజీ	630	645
బైవోల్టిన్	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 455.280 కిలోలు

ఇసుకాసురుల ఇష్టారాజ్యం!

- చెరువులను చెరపట్టారు
- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- తూతూ మంత్రంగా చర్యలు



కొత్తచెరువులో ఇసుకను అక్రమంగా లోడ్ చేస్తున్న దృశ్యం

గుర్రంకొండ: జిల్లాలో ఇసుకాసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొంత మంది జేసీబీలతో ఇసుకను తోడేస్తున్నారు.పగలంతా చెరువు పరిసర పొలాల్లో డంపింగ్ చేసి రాత్రిళ్ల గుట్టుచప్పుడు కాకుండా బయట ప్రాంతాలకు తరలించేస్తున్నారు. జిల్లాలో చెరువులు అతిపెద్ద ఇరిగేషన్ చెరువులు విస్తరించి ఉన్నాయి.వీటిల్లో ఇసుక నిల్వలు భారీగా ఉండడంతో ఇసుకాసురుల కళ్లు వీటిపై పడ్డాయి. రోజుల తరబడి జేసీబీలతో తోడేస్తున్నారు. ఒక జేసీబీ నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకొని ఇష్టానుసారంగా ఇసుకను తరలించేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు తూతు మంత్రంగా చర్యలు తీసుకొని చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలున్నాయి.

- ఇసుకాసులు ప్రస్తుతం ఇసుక తరలింపులో కొత్త మార్గానికి శ్రీకారం చుట్టారు. పగలంతా చెరువుల్లోని ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి చెరువుల వద్ద డంపింగ్ చేస్తున్నారు. రాత్రిళ్ల గుట్టుచప్పుడు కాకుండా వాహనాల ద్వారా బయట ప్రాంతాలకు తరలించేస్తున్నారు. పది నుంచి పదిహేను లోడ్ల వరకు డంపింగ్ చేస్తున్నారు.

ఇంటినిర్మాణాలు, ప్రభుత్వ పనుల సాకుతో..

ఇంటినిర్మాణాలు, ప్రభుత్వం పనుల కోసం అనే సాకుతో ఇసుకాసురులు ఇష్టానుసారంగా ఇసుకను విక్రయించుకొంటున్నారు. జిల్లాలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటిని సాకుగా చూపించి రోజుల తరబడి ఇసుకను చెరువుల నుంచి తోడేస్తూ కొంతమంది లక్షలాది రుపాయలు సొమ్ము చేసుకొంటున్నారు. గృహ అవసరాల కోసం ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే జేసీబీలతో తోడేయమని ఎక్కడా అనుమతి ఇవ్వలేదు. అయినా ఇవేవి తమకు పట్టవంటూ కొంతమంది నేతలు ఇసును జేసీబీలతో రేయింబవళ్లు తోడేస్తున్నారు. ఇసుక విషయమై అధికార పార్టీకి చెందిన ఓ వర్గం నేతలు ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన సంఘటనలు ఉన్నాయి. స్వయంగా అధికార పార్టీ నేతలే అధికారులకు ఫిర్యాదు చేసే స్థాయికి వచ్చారంటే ఏస్థాయిలో ఇసుక అక్రమరవాణా జరుగుతోంది తేటతెల్లమవుతోంది. ఇసుక అక్రమరవాణాను ఆరికట్టి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తూ కాలం వెళ్లదీస్తున్నారనే విమర్శలున్నాయి.పోలీసులు రెండు రోజుల పాటు చెరువుల వద్ద కాపాలాగా ఉన్నారు. మూడో రోజు నుంచి షరా మామూలే అన్న చందనంగా ఇసుకాసురులు అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిస్తున్నారు. దీంతో అధికారులు చేసేదిలేక చెరువులవైపు వెళ్లడం మానేశారని రైతులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పక్క మండలాలకు తరులుత్ను‌న ఇసుక

గుర్రంకొండ మండలంలోని మర్రిపాడు, తరిగొండ, అమిలేపల్లె, శెట్టివారిపల్లె, బోడిగుట్ట సమీప చెరువులతో పాటు కలకడ మండలంలోనూ ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. కొంతమంది చెరువులను ఆక్రమించి టన్నుల కొద్ది ఇసుకను తవ్వేస్తున్నారు. పక్కనే ఉన్న వాల్మీకిపురం, కురబలకోట, పెద్దమండ్యం మండలాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకను బయట ప్రాంతాల్లో రూ.3వేల నుంచి రూ.3200వరకు విక్రయిస్తున్నారు. కొంతమంది స్థానిక నేతలు రాత్రిళ్ల బయట ప్రాంతాలకు తరలించేస్తున్నారు. దీంతో ఇసుక దోపిడి మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోందని గ్రామస్తులు చర్చించుకోవడం గమనార్హం.

నిఘా ఉంచాం

ఇసుక అక్రమ రవాణా ప్రదేశాల్లో నిఘా ఉంచాం. అయినా కొంతమంది ఇవేవి పట్టనట్లు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. గ్రామాల్లో వీఆర్ఏలను కాపాలాగా ఉంచి ఇసుక అక్రమంగా తరలించే వాహనదారులపై చర్యలు తీసుకుంటాం.

– సదాశివప్ప నాయుడు, ఆర్ఐ, గుర్రంకొండ

ఒంటిమిట్టలో శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ట



ఆలయం చుట్టూ కుంభారాధన చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం పవిత్ర ప్రతిష్ట శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా సీతాలక్ష్మణ సమేత శ్రీరాములవారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, శాత్తుమొర, నివేదన, కుంభారాధన నిర్వహించారు. అనంతరం యాగశాలలో పవిత్రమాలలకు ఉపచారాలు జరిపారు. ప్రదక్షిణగా సన్నిధికి వేంచేపు చేశారు. ధ్రువమూర్తులకు, కౌతుకమూర్తులకు, స్నపనమూర్తులకు, విశ్వక్సేనులవారికి, గరుడాళ్వార్‌కు, యాగశాలలోని హోమగుండాలకు, ధ్వజస్తంభానికి , ఆలయం ఎదురుగా ఉన్న భక్త సంజీవరాయస్వామికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరిటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, భక్తులు పాల్గొన్నారు.

దారిమళ్లిన నాంధేడ్ వీక్లీ!



రాజంపేట: ప్రస్తుతం నాంధేడ్ నుంచి ధర్మవరం మధ్య నడుస్తున్న (07189/17190) వీక్లీ ప్రత్యేక రైలు దారిమళ్లనుంది. ఈ రైలు ఇప్పుడు నిజామాబాద్, కామారెడ్డి, చర్లపల్లె, నల్గొండ, నడికుడి, పిడుగురాళ్ల, వినుకొండ, నంద్యాల, ఎర్రగుంట్ల , కడప , తిరుపతి, పాకాల మార్గాల్లో నడిచేది. వచ్చే నెల నుంచి ఈ రైలు నిజమాబాద్, పెద్దపల్లె, వరంగల్ , విజయవాడ, గుడూరు, తిరుపతి, పాకాల మీదుగా నడపనున్నారు.

- మొదటిసారిగా పీలేరు, మదనపల్లె, కదిరి నుంచి ఉత్తర తెలంగాణాలోని జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లె, వరంగల్‌తో పాటు ఖమ్మం జిల్లాకు కూడా అనుసంధానం ఏర్పడింది. ప్రస్తుతం ఈ ప్రాంతాల నుంచి పీలేరు, కలికిరి , మదనపల్లె, కదిరి వెళ్లడానికి నేరుగా సౌకర్యం లేదు. ఇప్పుడు ఈ ప్రత్యేకరైలుతో తెలంగాణా రాష్ట్రంలోని నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, వికరాబాదు, గద్వాల ప్రాంతాలలో ఇప్పటికే మదనపల్లె, పీలేరు, కలికిరి అనుసంధానమై ఉన్నాయి.
- నాంధేడ్ ప్రత్యేక రైలుతో ఉత్తర తెలంగాణాతో మదనపల్లె , పీలేరుకు రైలు సౌకర్యం లభించినట్లైంది. సెప్టెంబర్ 7, 14, 21, 28 తేదీల్లో ఎగువమార్గంలో 4ట్రిప్‌లు, 07190 నంబరుతో ధర్మవరం నుంచి ఈ ఎక్స్‌ప్రెస్‌రైలు నడవనుంది.
- ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌రైలు 07189 నంబరుతో సెప్టెంబర్ 5, 12, 19, 26 తేదీల్లో నాంధేడ్‌లో సాయంత్రం 4.30కి బయలుదేరి, మరుసటిరోజు సాయంత్రం ధర్మవరం జంక్షన్‌కు 5గంటలకు చేరుకుంటుంది. అన్నమయ్య జిల్లాలో పీలేరు, మదనపల్లెరోడ్‌లో హాల్టింగ్ సదుపాయం కల్పించారు. ఈ రైలులో అధునాతన ఎల్‌హెచ్‌బీ బోగీలు ఉన్నాయి. ఐఆర్‌టీఎస్ పోర్టల్‌లో బుకింగ్ సౌకర్యం కూడా ప్రారంభమైంది.

క్లుప్తంగా

భూ వివాదంలో వ్యక్తిపై దాడి


దాయాదుల దాడిలో తీవ్రంగా గాయపడిన నాగరాజు

మదనపల్లె రూరల్ : భూ వివాదం కారణంగా దాయాదుల మధ్య జరిగిన గొడవలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. మాలేపాడు పంచాయతీ దొనబైలుకు చెందిన కట్టప్ప కుమారుడు నాగరాజు(45) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. అతను వ్యవసాయం చేస్తున్న పొలానికి సంబంధించి గత కొంత కాలంగా దాయాదులతో వివాదం ఉంది. ఈ క్రమంలో ఆదివారం దాయాదులైన చంద్ర, మల్లికార్జున, విశ్వనాథ్ గొడవకు దిగారు. దాడిచేసి నాగరాజును కర్రలతో కొట్టారు. దాడిలో నాగరాజు తీవ్రంగా గాయపడగా, స్థానికులు, కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

జూద స్థావరాలపై దాడి

నిమ్మనపల్లె : మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో జూద స్థావరాలపై దాడిచేసి 11 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. జూద నిర్వహణపై కచ్చితమైన సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి ఆదివారం అగ్రహారం గ్రామ సమీపంలో, కొత్తపల్లె సమీపంలో జూదస్థావరాలపై దాడి చేసి రూ.11,300 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

బార్లకు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తుల స్వీకరణ

మదనపల్లె రూరల్ : అన్నమయ్య జిల్లాలోని 11 బార్లకు నిర్వహించనున్న లక్కీ డ్రాలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు ఇవ్వవచ్చని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఆన్‌లైన్‌లో డిపాజిట్లు, ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆఫ్‌లైన్ దరఖాస్తులకు డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా డిపాజిట్, ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించాలన్నారు. ఈనెల 26వతేదీ సాయంత్రం 5 గంటలలోపు పూర్తిచేసిన అన్ని దరఖాస్తులను రాయచోటిలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయానికి చేర్చాలని కోరారు.

'అగ్నివీర్'కు 159 మంది అర్హత


అగ్నివీర్ ఆర్మీ రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఎస్వీ డిఫెన్స్ అకాడమి విద్యార్థులు

తిరుపతి రూరల్ : అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ రాత పరీక్షలో ఎస్వీ డిఫెన్స్ అకాడమికి చెందిన 159 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు ఆ అకాడమి చైర్మన్ బి.శేషారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఉచితంగా ఫిజికల్ ట్రైనింగ్ ఇప్పామని, వారు ఉద్యోగంలో చేరడానికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. అర్హత సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

బొజ్జ గణపయ్య పండుగ .. ఉపాధి మెండుగా

- చిరు వ్యాపారులు, వివిధ రంగాల కార్మికులకు చేతినిండా పని
- 27 నుంచి ప్రారంభం కానున్న గణపయ్య వేడుకలు


వినాయక మండపం కోసం స్టేజి ఏర్పాటు చేస్తున్న కార్మికులు


బొజ్జగణపయ్య విగ్రహం

రాజంపేట టౌన్ : నాణేనికి ఒకవైపు కాదు రెండువైపులా చూడాలి అంటుంటారు పెద్దలు. అలాగే వినాయచవితి వేడుకలు అంటే భక్తిభావం, సందడైన వాతావరణం అన్న అభిప్రాయమే ప్రజల్లో నాటుకు పోయింది. అయితే ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. హిందువులకు పెద్ద పండుగ సంక్రాంతి. అయితే సంక్రాంతి పెద్ద పండుగ అయినప్పటికి ప్రధానంగా దుస్తులు, నిత్యావసర సరుకుల వ్యాపారులకు ఆదాయాన్ని ఇస్తుంది. అయితే వినాయక చవితి పండుగ చిరువ్యాపారులకు, వివిధ రంగాల కార్మికుల, రైతుల కడుపు నింపుతుంది. వినాయక చవితి ప్రారంభానికి ముందు నుంచే అనేక మందికి ఉపాధి దొరుకుతుంది. అందువల్ల ఈ ఉత్సవాలపై అనేక మంది ఆశలు పెట్టుకుంటారు. మరో రెండు రోజుల్లో పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో చవితి వేడుకల సందడి ప్రారంభం కానుంది. అందువల్ల ఇప్పటి నుంచే వివిధ రంగాల కార్మికులు చవితి ఉత్సవాలకు సంబంధించిన పనులు జోరుగా చేస్తున్నారు.

కళాకారులకు పండగే..

సెల్‌ఫోన్ అందుబాటులోకి వచ్చాక కాలక్షేపానికి, వినోదానికి కొదవలేదనే చెప్పాలి. అందువల్ల అనేక కళలు కూడా అంతరించిపోయాయి. అయితే వినాయక చవితి సందర్భంగా గాన, నృత్య, మిమిక్రి, మ్యాజిక్‌షో, సన్నాయి వాయిద్యం, డ్రమ్స్ వాయించే కళాకారులకు చేతినిండా పని లభించి కనీసం ఓ రెండు నెలల పాటు వారి కుటుంబాల పోషణ సాఫీగా సాగిపోతుంది. జిల్లాలో వందలాది మంది కళాకారులు వివిధ కళలను నమ్ముకొని జీవిస్తున్నారు. వారిలో అనేక మంది కళల ద్వారా వచ్చే ఆదాయంతో జీవించే వారు కూడా లేకపోలేదు. అలాంటి వారికి వినాయక చవితి నిజంగా కడుపునింపే పండుగ అనే చెప్పాలి. కాగా చవితి ఉత్సవాలు జరిగినన్ని రోజులు పురోహితులకు కూడా ఉపాధి లభిస్తుంది.

చిరు వ్యాపారులకు, రైతులకు సైతం..

కొన్ని రోజుల పాటైనా ఇబ్బందులు లేకుండా చిరు వ్యాపారులు, రైతుల కడుపునింపేందుకు వినాయక చవితి వేడుకలు ఎంతగానో దోహదపడతాయి. చవితి వేడుకలు జరిగినన్ని రోజులు ప్రధానంగా పూలు, పండ్ల వ్యాపారం జోరుగా సాగుతుంది. అందువల్ల వ్యాపారులకు, రైతులకు కొంతమేర ఆదాయం సమకూరి వారి కుటుంబ పోషణకు దోహదపడనుంది.

కార్మికులకు ఉపాధి..

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా అసంఘటిత కార్మికులకు ఉపాధి లభిస్తుంది. ఇందులో ఎలక్ట్రీషియన్, దినసరి కూలీలు, ట్రాక్టర్ డైవర్లకు చేతినిండా పని దొరుకుతుంది. ఇందువల్ల చవితి ఉత్సవాలు జరిగినన్ని రోజులు అసంఘటిత కార్మికుల్లో కొంత మందికి మెండుగా ఉపాధి దొరుకుతుంది.

అన్ని రోజులు పని ఉంటుంది



వినాయక చవితి ఉత్సవాలు జరిగినన్ని రోజులు పని ఉంటుంది. ప్రస్తుతం చాలా మంది ఉత్సవ కమిటీ ప్రతినిధులు స్వామివారి మండపాలను కనువిందుచేసేలా ఉండేందుకు ఖర్చుకు వెనుకాడటం లేదు. అందులో భాగంగా మండపాలను విద్యుత్ దీపాల వెలుగులో శోభాయమానంగా అలంకరిస్తున్నారు. ఈ కారణంగా ఎలక్ట్రీషియన్లకు చేతినిండా పని ఉంటుంది.

- ఎం.పెంచలయ్య, ఎలక్ట్రీషియన్, రాజంపేట

వ్యాపారం మూడింతలు పెరుగుతుంది



ప్రతి ఏడాది వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే సంఖ్య పెరుగుతూ పోతుంది. వినాయకుడి విగ్రహాన్ని నిత్యం భారీ పూలమాలలతో అలంకరిస్తారు. కేవలం దండలే కాక విడిపూలను కూడా భక్తులు ఎక్కువగా కొంటారు. అందువల్ల పూల వ్యాపారం సాధారణ రోజుల కంటే మూడింతలు ఎక్కువగా జరుగుతుంది.

- షేక్ మహమ్మద్ అలీ, పూలవ్యాపారి, రాజంపేట

కడుపునిండా భోజనం



పాటలు పాడటం, యాంకరింగ్, డ్యాన్స్ చేయడం వంటి కళలను నమ్ముకొని అనేక మంది జీవిస్తున్నాము. మాకు వివాహాలు, ఉత్సవాలు, జాతర సందర్భంగానే ఉపాధి ఉంటుంది. వినాయక చవితి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు జరుగుతాయి. అందువల్ల మాలాంటి స్టేజి కళాకారులకు వినాయక చవితి నిజంగా కడుపునింపే పండుగ.

-బొజ్జా అభిరామ్, డ్యాన్స్‌మాస్టర్, రాజంపేట

వ్యాపారం జోరుగా సాగుతుంది



వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభానికి నాలుగైదు రోజుల నుంచి వ్యాపారం జోరుగా సాగుతుంది. వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేవారు పూజా కార్యక్రమాలకు విశేషంగా ప్రాధాన్యత ఇస్తున్నారు. అలాగే ఉభయాలు ఇచ్చేవారు కూడా సాంప్రదాయ పద్ధతిలో పూజలు చేస్తున్నారు. ఈ కారణంగా వినాయక చవితి సందర్భంగా పూజా సామగ్రిని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

- గాడి శివమణిరెడ్డి, పూజాసామగ్రి వ్యాపారి, రాజంపేట

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి : ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 24వ తేదిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

12వ పీఆర్సీ కమిషన్ నియమించాలి

సుండుపల్లె : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు వెంటనే 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ పి.చిన్నరెడ్డన్న డిమాండ్ చేశారు. సంఘం అన్నమయ్య జిల్లా శాఖ సమావేశం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జిల్లా ఉపాధ్యక్షుడు పి.సుబ్బరామరాజు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చిన్నరెడ్డన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన డీఏ, డీఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 12వ పీఆర్‌సీ నియమిస్తామని, ఉద్యోగుల బకాయిలు చెల్లిస్తామని ప్రకటించిందని కానీ 15 నెలలు గడిచినా పట్టించుకోలేదన్నారు. జిల్లా అధ్యక్షుడు బి.వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డికుమార్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వై.శంకర్‌రెడ్డి, వై.రామకృష్ణారెడ్డి, ఈశ్వరయ్య, మేకల రామచంద్ర, శ్రీనివాస్‌రెడ్డి, తాలూకా యూనిట్ నాయకులు రాజారెడ్డి, రామసుబ్బరాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా కంటక పాలన

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి

రాయచోటి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌ల నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజా కంటక పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి విమర్శించారు. రాయచోటిలోని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి పాలన ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్రంలో అరాచకం, అవినీతి, బంధుప్రీతి, దోపిడీలు అధికమయ్యాయని ఆరోపించారు. పథకాల పేరుతో ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. తల్లికి వందనం, ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం పథకాలలో భారీగా కోత విధించారన్నారు. ఈ క్రమంలోనే దివ్యాంగుల పెన్షన్లలో నిజమైన అర్హులకు కూడా కోతకోసి వారికి గుండె కోతను మిగిల్చారన్నారు. చిలమత్తూరులో మహిళా ఎంపీపీపై టీడీపీ నాయకులు భౌతికంగా దాడి చేయడం దారుణమన్నారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో సాక్షాత్తు మంత్రి రాంప్రసాద్ రెడ్డి తనకు సంబంధం లేని పోలింగ్ కేంద్రాలలో దౌర్జన్యం, అరాచకాలకు తెర తీశారన్నారు. ప్రశ్నించే వారిపై దాడులు చేయడం, కేంద్రం నిధులు దోచేయడమే కూటమి ప్రభుత్వ పాలన పనిగా పెట్టుకొందన్నారు. పంచాయతీరాజ్ విభాగంలో 1130 సెక్రటరీలకు వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. మీడియా సమావేశంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని విద్యార్థికి తీవ్ర గాయాలు


రోడ్డుప్రమాదంలో గాయపడిన గౌతమ్

మదనపల్లె రూరల్ : ఆగి ఉన్న లారీని ఢీకొన్న విద్యార్థికి తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉన్న ఘటన శనివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. పుంగనూరు మండలం ఈడిగపల్లెకు చెందిన శ్రీనివాసులు కుమారుడు గౌతమ్(18) మదనపల్లెలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. శనివారం కళాశాల ముగించుకుని ఆలస్యంగా ద్విచక్రవాహనంలో రాత్రి ఇంటికి బయలు దేరాడు. మార్గమధ్యంలోని గ్రీన్‌వ్యాలీ స్కూల్ సమీపంలో ఆగి ఉన్న లారీని వేగంగా వెళ్లి ఢీకొన్నాడు. ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కాగా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు బెంగళూరుకు తీసుకెళ్లారు.

రెడ్డెమ్మకొండలో భక్తుల రద్దీ


శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో భక్తుల రద్దీ

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం ఉదయం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లోని దిగువ తొట్లివారిపల్లెలో అమ్మవారి అర్చకుల కుటుంబీకులు పంపిణీ చేసే ఆకు పసరును సేవించి మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించారు. తడిబట్టలతోనే అమ్మవారి ఎదుట సంతానం కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరె సారెలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా భక్తులు అమ్మవారి ఆలయానికి తరలివచ్చి పూజలు నిర్వహించారు.

జిల్లా జూనియర్ బాల,బాలికల షూటింగ్ బాల్ జట్ల ఎంపిక


ఎంపికైన జిల్లా జూనియర్ బాలుర షూటింగ్ బాల్ జట్టు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం పుంగనూరు రోడ్డులోని గ్రీన్‌వ్యాలీ స్కూల్‌లో ఆదివారం జిల్లా షూటింగ్ బాల్ బాల,బాలికల జట్ల ఎంపిక జరిగింది. జిల్లా నలుమూలల నుంచి సుమారు వందమంది క్రీడాకారులు పాల్గొన్నారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గౌతమి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ నెలలో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంటులో పాల్గొంటారని తెలిపారు. జిల్లా అసోసియేషన్ చైర్మన్ జునైద్ అక్బరీ అభినందించారు. కార్యక్రమంలో ఏషియన్ గోల్డ్ మెడలిస్టు యూసుఫ్, అసోసియేషన్ సభ్యులు భారతి, మండల స్కూల్ గేమ్స్ కో ఆర్డినేటర్ శివశంకర్, సెలక్షన్ కమిటీ సభ్యులు కుమార్ నాయక్, జయంత్, తిరుమలేష్, పీడీలు గురు, మణి, లత, మంజుల, చిన్నప్ప, మౌనిక పాల్గొన్నారు.

కలకలం రేపుతున్న క్షుద్ర పూజలు

సింహాద్రిపురం : మండల కేంద్రంలో క్షుద్ర పూజలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ కలకలం రేపుతున్నాయి. మండల కేంద్రంలో ఈద్గా సమీపంలో వెన్నపూసపల్లెకు వెళ్లే దారిలో క్షుద్ర పూజలు పలుమార్లు జరుపుతున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. ఎందుకు చేస్తున్నారో అర్థం కాక ఆ దారిన తరచూ వెళ్లే రైతులు, అలాగే మహిళలు భయాందోళనకు గురవుతున్నారు.

జిల్లా టీడీపీ అధ్యక్ష రేసులో సుగవాసి ప్రసాద్ బాబు

- సుగవాసికి జై కొడుతున్న మంత్రి అసమ్మతి నేతలు
- మంత్రి అనుయాయులకే అధ్యక్ష పదవి అంటున్న తమ్ముళ్లు
- జిల్లా అధ్యక్షుని ఎన్నికపై నేడు రాయచోటిలో త్రీ మెన్ కమిటీ సమావేశం

రాయచోటి : అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుని ఎన్నిక ఆ పార్టీలో వర్గ విభేదాలను బహిర్గతం చేస్తోంది. పార్టీ అధ్యక్షుడిగా ఉన్న జగన్‌మోహన్ రాజును రాజంపేట నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జిగా ప్రకటించడంతో జిల్లా అధ్యక్ష స్థానం ఖాళీ ఏర్పడింది. ఈ పదవిని టీడీపీ నేత సుగవాసి ప్రసాద్ బాబు ఆశిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు జిల్లాలోని నియోజకవర్గాల నాయకుల మద్దతును కూడగట్టుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. జిల్లాకు చెందిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వ్యతిరేకంగా ఉన్న ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకుల మద్దతును కోరినట్లు తెలిసింది. ఇదే సమయంలో సుగవాసి ప్రసాద్ బాబుకు జిల్లా అధ్యక్ష పదవి రానివ్వకుండా జిల్లాకు చెందిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పావులు కదిపినట్లు సమాచారం. తన అనుచరులైన మైనార్టీలలో ఒకరికి జిల్లా అధ్యక్ష పదవిని ఇప్పించే ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల సమాచారం. ఇదే విషయంపై ఆదివారం రాయచోటిలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో స్థానిక మంత్రి చర్చించినట్లు కూడా తెలియవచ్చింది. జిల్లా టీడీపీ అధ్యక్ష పదవి, కమిటీ ఎంపిక విషయంలో టీడీపీలో మరోమారు వర్గ విభేదాలు అన్నమయ్య జిల్లాలో బహిర్గతమయ్యాయని ఆ పార్టీకి చెందిన నాయకులు అభిప్రాయపడుతున్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో పార్లమెంటు అధ్యక్షులు, అనుబంధ కమిటీల ఎంపిక విషయమై త్రీమెన్ కమిటీ అధ్యక్షుడు, రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, సభ్యులు వీరాంజనేయులు, వై.నాగేశ్వరరావు యాదవ్‌ల ఆధ్వర్యంలో వినతులు, అభిప్రాయాలు స్వీకరించి రాష్ట్ర కమిటీకి ప్రతిపాదనలను అందజేయనున్నారు.

నేడు పార్లమెంటు స్థాయి విస్తృత సమావేశం..

రాయచోటిలోని సుధా కళ్యాణ మండపంలో రాజంపేట పార్లమెంటు స్థాయి విస్తృత సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నారు. అనంతరం పార్లమెంట్ కమిటీ, పార్లమెంటు అనుబంధ కమిటీలు, రాష్ట్ర కమిటీకి ప్రతిపాదనలు త్రీమెన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన స్వీకరించనున్నారు. సమావేశం సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనున్నట్లు పార్టీ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని వసంతపేటలో ఉమ్మడిశెట్టి లక్ష్మీప్రసాద్ (34) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు ఉమ్మడిశెట్టి వెంకటసుబ్బన్న వస్త్ర దుకాణంలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. అతనికి ముగ్గురు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. వారిలో చిన్న కుమారుడైన ఉమ్మడిశెట్టి లక్ష్మీప్రసాద్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. రెండేళ్ల క్రితం ఎర్రగుంట్లకు చెందిన చంద్రకళ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న యువతితో వివాహమైంది. పెళ్లైన వారం రోజుల నుంచే వారి మధ్య విభేదాలు తలెత్తడంతో ఇద్దరు వేర్వేరుగా ఉంటున్నారు. పెద్దలు పంచాయతీ చేసినా వారి మధ్య సఖ్యత కుదరలేదు. గతంలో లక్ష్మీప్రసాద్ హైదరాబాద్‌లో ఆత్మహత్యా యత్నం చేశాడు. కొన్ని రోజుల తర్వాత అతని కిడ్నీ చెడిపోవడంతో డయాలసిస్ చేయిస్తున్నారు. తన ఆరోగ్యం కుదుట పడలేదని, చనిపోవాలనిపిస్తోందని అతను తల్లిదండ్రులతో చెప్పగా వారు ధైర్యం చెబుతూ వచ్చారు. ఈ క్రమంలో ఈ నెల 22న అతను హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరుకు వచ్చాడు. శనివారం రాత్రి భోజనం చేసిన తర్వాత అతను మిద్దెపైకి వెళ్లి పడుకున్నాడు. రాత్రి పొద్దుపోయాక కుటుంబ సభ్యులు చూడగా లక్ష్మీప్రసాద్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. అతన్ని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి వెంకటసుబ్బన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

హైకోర్టు ఆదేశాలతో ఫిట్‌పర్సన్ బదిలీ

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజీని హైకోర్టు ఆదేశాలతో దేవదాయ శాఖ కమిషనర్ బదిలీ చేశారు. ఆయన స్థానంలో స్థానిక మఠం మేనేజర్‌కు బాధ్యతలు అప్పజెప్పారు. మఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామి 2021 సంవత్సరం మే 18న శివైక్యం చెందారు. మఠాధిపతి నియామకంలో మఠాధిపతి పెద్ద భార్య కుమారులు, రెండవ భార్య మధ్య వివాదం కావడంతో పరిపాలన వ్యవహారాల కోసం మఠాధిపతి స్థానంలో దేవదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న శంకర్‌బాలాజీని మఠం ఫిట్‌పర్సన్‌గా నియమించింది. దాదాపు మూడేళ్ల కాలంలో ఫిట్‌పర్సన్‌గా బి.మఠంలో రూ.10 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆయన చేస్తున్న కొన్ని పనులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని పూర్వపు మఠాధిపతి రెండవ భార్య మారుతీ మహాలక్షుమ్మ అభ్యంతరం వ్యక్తం చేస్తూ వచ్చారు. ఆయనను బి.మఠం ఫిట్‌పర్సన్‌గా తొలగించాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో శంకర్‌బాలాజీని ఫిట్‌పర్సన్ బాధ్యతల నుంచి తొలగించాలని దేవదాయ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది.

ఈడబ్ల్యూఎస్ విధానాన్ని ఎత్తివేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ ఎం.రంగనాయకులు

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ విధానాన్ని వెంటనే ఎత్తివేయాలని జేఏసీ చైర్మన్ ఎం.రంగనాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి పట్టణలలోని ఎన్‌జీఓ హోంలో ఏపీ బీసీ పెన్షనర్స్ ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చట్టసభలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలన్నారు. కేంద్ర మంత్రిత్వ శాఖల్లో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. పెన్షనర్ల హక్కులను హరించే ఆర్థిక బిల్లు 25ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రోహిణి కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో చింతం నాగరాజు, బీసీఎఫ్ జనరల్ సెక్రటరీ కుమార్‌యాదవ్, డి.శంకర్, బీసీఈ చంద్ర, జిల్లా బీసీ పెన్షనర్స్ ఉద్యోగ ఉపాధ్యాయ అధ్యక్షురాలు దివిటి పద్మయాదవ్, మహిళా సెక్రటరీ కందుకూరి సుమితాగౌడ్, జనరల్ సెక్రటరీ కందుకూరి రామయ్య, జాయింట్ సెక్రటరీ ఎల్.గంగాధర్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ గంగాధర్, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించాలి


అత్యవసర సమావేశంలో పాల్గొన్న నాయకులు

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటిని అన్నమయ్య జిల్లా కేంద్రంగా కొనసాగించాలని అన్నమయ్య జిల్లా సాధన సమితి డిమాండ్ చేసింది. ఆదివారం రాయచోటి పట్టణంలోని సాయిశుభ కళ్యాణ మండపంలో అత్యవసర సమావేశంలో వివిధ సంఘాల నాయకులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జిల్లా కేంద్రాన్ని ఇతర ప్రాంతానికి తరలించాలన్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రాయచోటినే జిల్లా కేంద్రంగా కొనసాగించాలని వారు కోరారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సీఎం చంద్రబాబుతో చర్చించి జిల్లా కేంద్రం మార్పును అడ్డుకోవాలని.. లేనిపక్షంలో ఉద్యమానికి సన్నద్ధం అవుతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ బయారెడ్డి, సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, విజయభాస్కర్, గంగిరెడ్డి, రామాంజులు, ప్రకాష్, మైనార్టీ నేత ఇర్షాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, న్యాయవాది రెడ్డప్పరెడ్డి, భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

విద్యాసాగర్ ఆస్పత్రిలో 500 రొబొటిక్ శస్త్ర చికిత్సలు


మాట్లాడుతున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : బోన్, జాయింట్ కేర్‌లో అద్భుతమైన ప్రయాణంలో మరొక పెద్ద మైలు రాయిని విద్యాసాగర్ ఆసుపత్రి అధిగమించిందని, తమ ఆస్పత్రిలో 500 రోబొటిక్ మోకాళ్ల శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేయడం సంతోషంగా ఉందని ఆస్పత్రి ఎండీ డాక్టర్ సి.విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. ఆస్పత్రిలో ఆదివారం ఆయన కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నొప్పి నుంచి నూతన జీవితం వరకు ప్రయాణించిన అనేక మంది రోగుల చిరునవ్వులు చూడడం ఆత్మ సంతృప్తిని ఇస్తోందన్నారు. తమ ఆస్పత్రిలో గత 15 ఏళ్లుగా ఎముకలు, కీళ్ల సంరక్షణలో విశేష సేవలందిస్తూ 7500 లకు పైగా మోకాలు మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ విజయం అధునాతన జాయింట్ రీప్లేస్‌మెంట్ సాంకేతికతలో ఒక ముందడుగు అన్నారు. రాయలసీమలో జాయింట్ కేర్ కోసం ప్రపంచ స్థాయి సీఓఆర్ఐ రోబొటిక్ సాంకేతికతను పరిచయం చేసిన మొదటి ఆసుపత్రిగా విద్యాసాగర్ హాస్పిటల్ , పాక్షిక, సంపూర్ణ మోకాళ్ల మార్పిడి శస్త్రచిత్సలతోపాటు హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్సలను కూడా విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. 500 రోబొటిక్ మోకాళ్ల శస్త్రచికిత్సల మైలు రాయిని చేరుకోవడం తమ బృందం అంకితభావానికి, ప్రజల నమ్మకానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, రిటైర్డ్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ నాగముని రెడ్డి, ఇంటాక్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రంగనాథ రెడ్డి, సైకాలజిస్ట్ ఓవీ రెడ్డి,, కడప నగరంలోని ప్రముఖ డాక్టర్లు, పెన్షనర్లు పాల్గొన్నారు.